ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం | 12 జూన్, 2026 | పేజీలు : 04

# తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తరువాతనే పవన్ సభ పెట్టుకోవాలి



# ప్రకృతి వ్యవసాయంపై రైతు సమ్మేళనం

## రైతులకు అవగాహన కల్పించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**ప్రజాపక్షం / జమ్మికుంట :** రసాయన ఎరువుల ద్వారా పండిస్తున్న పంటలను కొని తినడమంటే పైసలిచ్చి రోగాలను కొని తెచ్చుకోవడమేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. జమ్మికుంటలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతు సమ్మేళనం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హోం మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని విడనాడి ప్రకృతి వ్యవసాయం పై దృష్టి సారించాలని అన్నారు. సేంద్రీయ వ్యవసాయం చేసిన రైతులు కోటీశ్వరులు అయ్యే అవకాశం ఉందన్నారు. కోటిమంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించడమే ప్రధాని మోదీధ్యేయమని పేర్కొన్నారు. మోదీ 4400 రోజుల పాలన పూర్తయిన నేపథ్యంలో ఆయన స్ఫూర్తితో రాబోయే రెండేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 25 వేల మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. గోమాత, భూమాత, భరతమాత నినాదంతో మూడేళ్లపాటు 6 వేల 18 మంది రైతులతో 19 గ్రామాల్లో 10 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తూ రాబోయే రోజుల్లో 50 వేల ఎకరాల్లో సాగు లక్ష్యంగా ముందుకు సాగుతున్న జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం నిర్వాహకులను సిబ్బందిని అభినందిస్తున్నానని రాబోయే రోజుల్లో రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేందుకు జమ్మికుంట కెవికె చర్యలు తీసుకోవాలని కోరారు. ఉజ్జెకిస్తాన్ వంటి దేశం రసాయనాలు వాడడం వల్ల సర్వనాశనమైందని దేశానికి అన్నపూర్ణగా విలసిల్లిన పంజాబ్‌లో రసాయన ఎరువుల వాడకం ఎక్కువ కావడం వల్ల క్యాన్సర్ రోగాలు ఎక్కువయ్యాయని పేర్కొన్నారు. క్యాన్సర్ రోగుల కోసం ప్రత్యేక రైలు వెళుతున్న దృశ్యం అత్యంత బాధాకరమన్నారు. మన ఆరోగ్యం కోసం దేశ భవిత కోసం మాత్రమే పొదుపు పేరుతో సప్త సూత్రాలు చెప్పారని అన్నారు. ప్రజలంతా ప్రకృతి వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులు కొనడానికి సిద్ధంగా ఉన్నారని రైతులంతా ఆ దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్‌ను ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మీ , ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శత్రు నాయక్, బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి, కేవీకే వ్యవస్థాపక సభ్యులు విజయపాల్ రెడ్డి, సీనియర్ సైంటిస్ట్ వెంకటేశ్వర్ రావు, కిసాన్ మోర్చా నాయకులు మహిపాల్ రెడ్డి, క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులో ఉండాలి.. వైద్యం అందించాలి

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
## సిరిసిల్ల సుందరయ్య నగర్ అర్బన్ పీహెచ్ సీ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల సుందరయ్య నగర్ లోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్ సీ)లో జిల్లా కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఒపి, వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. ఎఎన్ సి నమోదు, ఎన్‌సిడిస్క్రీనింగ్ టెస్టులపై ఆరా తీశారు. వ్యాక్సిన్ గది, మందులు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని, ప్రభుత్వ వైద్యశాలల్లోనే ప్రసవాలు, చికిత్స పొందేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత పై వివరించాలని పేర్కొన్నారు. సబ్ సెంటర్ లలో మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఎన్ సీడీ స్క్రీనింగ్ టెస్టులు చేయాలని ఆదేశించారు.

# మారుమూల పల్లెలకు ఆర్‌టిసి సేవలు : కలెక్టర్




**ప్రజాపక్షం/నిజామాబాద్:** విద్యార్థులకు, ప్రజలకు, రైతులకు రవాణా వసతి మెరుగుపర్చేందుకు వీలుగా మారుమూల ప్రాంతాలకు సైతం ఆర్‌టిసిసేవలను విస్తరించాలని, ప్రజలు రాకపోకలు సాగించే రూట్లలో బస్సు సర్వీసులు నడపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులను ఆదేశించారు. ఆర్‌టిసిబస్సులు అందుబాటులో ఉండటం లేదని పలువురు ప్రజావాణిలో ఫిర్యాదులు చేయటం, ఇటీవల నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలలో ఆర్‌టిసిబస్సు సర్వీసుల కోసం ప్రజల నుండి విజ్ఞప్తులు రావడాన్ని దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఐడీఓసీలో ఆర్‌టిసిఅధికారులు, ఎంపీఓలతో ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఆయా మండలాల పరిధిలో ఆర్‌టిసిబస్సు సర్వీసులు అవసరమైన మారుమూల గ్రామాలు, తండాల వివరాలను ఎంపిఒల ద్వారా సేకరించి ఆ జాబితాను ఆర్‌టిసిఅధికారులకు అందజేయించారు. ప్రజల రవాణా అవసరాలకనుగుణంగా ఆయా ప్రాంతాలకు ఆర్‌టిసిబస్సులు నడిపించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల రాకపోకలకు ఆస్కారమున్న ప్రాంతాలకు బస్సు సర్వీసులు నడపటంతో అటు ప్రజలకు రవాణా సౌలభ్యం ఏర్పడటంతో పాటు ఆర్‌టిసిసంస్థకు కూడా తగిన ఆదాయం సమకూరుతుందన్నారు. ప్రస్తుం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని, ఖరీఫ్ సీజన్ పంటలు విత్తుకునేందుకు రైతులు ఎరువులు, విత్తనాలు క్రిమిసంహారక మందుల కోసం రాకపోకలు సాగిస్తారని, ప్రజలు తమ దైనందిన అవసరాల కోసం రవాణా వసతిపై ఆధారపడుతారన్నారు. ప్రతిపాదిత రూట్లలో వచ్చే సోమవారం నుండి ఆర్‌టిసిబస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని పక్షం రోజుల తర్వాత తాను మరోమారు సమీక్ష నిర్వహిస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో డిపిఒ శ్రీనివాస్‌రావు, ఆర్‌టిసిఆర్‌ఎం మూర్తి, డిప్యూటీ ఆర్‌ఎం మధుసూదన్, డిపో 1 మేనేజర్ ఆనంద్, అన్ని మండలాల ఎంపీఓలు పాల్గొన్నారు.

# ఒక్కగింజా కోతలేకుండా రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



ఈ రబీ సీజన్ లో పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా,రికార్డు స్థాయిలో గింజ కటింగ్ లేకుండా ధాన్యం , మొక్కజొన్న కొనుగోళ్లను పూర్తి చేసిందని ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు వెల్లడించారు.

వివరాలు మెయిన్‌లో...

## ముగిసిన ఐవివై సిద్ధార్థ నరేన్ క్రికెట్ సమ్మర్ క్యాంపు

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్:**సీతారాంపూర్‌లోని ఐవివై ఇంటర్నేషనల్ (సిబిఎస్ఈ) పాఠశాలలో, భగత్‌నగర్‌లోని సిద్ధార్థ పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ క్రికెట్ క్యాంపు బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు పసుల మహేశ్, ప్రిన్సిపల్ లలిత మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునేలా పాఠశాలలో సమ్మర్ క్యాంపు ప్రారంభించామన్నారు.పాల్గొన్న విద్యార్థులకు యాజమాన్యం సర్టిఫికెట్లు, జ్ఞాపికలు ప్రధానం చేశారు. ఈ క్యాంపులో పాల్గొన్న క్రికెట్ కోచ్ నరేన్, శివ, ప్రదీప్, పీఈటి సుశీల్, రాకేశ్, మహమ్మద్ ఖాసీమ్ తదితరులు విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.

## టిఆర్ఎస్ జెండా ఆవిష్కరణ

**ప్రజాపక్షం / శంకరపట్నం:**శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండాను ఆ పార్టీ నాయకులు చిట్టెంపల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ బాధ్యులు గుంజపడుగు హరిప్రసాద్, మానకొండూర్ నియోజకవర్గ ఇంచార్జీ బుడిగే పరశురామ్ గౌడ్ లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ అధినేత కవితమ్మ ఆదేశాలమేరకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సామాజిక తెలంగాణ సాధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీకి గాయాలు

**ప్రజాపక్షం / శంకరపట్నం :**మండల పరిధిలోని కరీంపేట గ్రామానికి చెందిన జన్నారపు కనకయ్య (65) రోజువారి పనిలో భాగంగా గురువారం తన భార్య నీలమ్మతో కలిసి చెరువుల ఉపాధి హామీ పూడికతీత పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడడంతో కుడికాలు తొంటి భాగం విరిగింది. తోటి కూలీలు గమనించి 108కు సమాచారం ఇవ్వడంతో 108 సిబ్బంది సతీష్ రెడ్డి, గోపికృష్ణ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అందిస్తూ కనకయ్యను కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు.

## గుండెపోటుతో ఉపాధి హామీ కూలీ మృతి

**ప్రజాపక్షం / రామడుగు :**ఉపాధి హామీ కూలీ పనికి వెళ్లిన వ్యక్తి పనిచేసే చోటే కుప్పకూలి మృతి చెందిన సంఘటన మండలంలోని గుండి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మచ్చ లచ్చయ్య తన భార్యతో కలిసి గత నెల రోజులుగా ఉపాధి హామీ కూలీ పని చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. రోజువారిలాగే గురువారం ఉదయం కూలీ పనికి వెళ్లినచోట గుండెపోటు రావడంతో తోటి కూలీలు వెంటనే 108 కు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే లోపే మచ్చ లచ్చయ్య మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## హోమ్ బేస్డ్ కేర్ గివర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇజ్రాయెల్ దేశంలో హోమ్ బేస్డ్ కేర్ గివర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పెద్దపల్లి జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇజ్రాయెల్‌లో హోమ్ బేస్డ్ కేర్ గివర్ ఉద్యోగాలకు డిమాండ్ ఉందని, మొత్తం 3500 ఖాళీలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇందులో 90 శాతం మహిళలకు, 10 శాతం పురుషులకు కేటాయించినట్లు తెలిపారు. ఎఎన్ఎమ్ / జిఎన్ఎమ్ /ఎమ్‌పిహెచ్‌డబ్ల్యు / డిప్లొమా ఇన్ పేషెంట్ కేర్ / బిఎస్‌సి నర్సింగ్ విద్యార్హత కలిగి, 25 నుండి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రభుత్వం నుండి గుర్తింపు పొందిన భారతీయ అధికార సంస్థ ద్వారా గుర్తింపు పొందిన నర్సింగ్ డిప్లొమా నుంచి శిక్షణ పొంది ఉండాలని, కనీసం 2 సంవత్సరాల నర్సింగ్ అనుభవం, ఇంగ్లీష్ భాషా ప్రాథమిక పరిజ్ఞానం తప్పనిసరి అని, ఎంపికైన వారికి నెలకు సుమారు 5880.02 NIS,2000 యు ఎస్ డి,193,000 వేతనం రెండు సంవత్సరాల ఒప్పందం కాలంతో ఉద్యోగ అవకాశాలు కల్పించబడుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు మరింత సమాచారం కోసం 9440052081, 9440051763, 9440052 5 9 2, 9440049645 నంబర్లలో సంప్రదించాలని, tomco mglobal@gmail.com మెయిల్ ఐడికి పంపవలసింది గాజిల్లాఉపాధి కల్పన అధికారి ఆ ప్రకటనలు పేర్కొన్నారు.

## 2028లో అధికారమే లక్ష్యం

### బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి




**ప్రజాపక్షం / గంగాధర :**2028లో జరిగే ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికునిలా పని చేయాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. గురువారం గంగాధర మండలం బూరుగుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల అవగాహన సదస్సు, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీవన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. సభ్యత్వ నమోదు ఇంచార్జీ పన్యాల భూపతి రెడ్డి నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాల లక్ష్యాన్ని పూర్తి చేసి రాష్ట్రంలో నంబర్‌వన్‌గా నిలవాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి సభ్యత్వాలు నమోదు చేస్తామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అభివృద్ధి పనులపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, సోషల్ మీడియా వారియర్స్, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి పాఠశాల ఒక ఉద్యానవనం కావాలి

### జిల్లా పరీక్షల-విజ్ఞానశాస్త్ర పర్యవేక్షకుడు వి.హనుమంతు* జాతీయ విద్యార్థి పర్యావరణ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన,బాధ్యతా భావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ విద్యార్థి పర్యావరణ పోటీవిత్తనం నుండి వృద్ధి వరకు 2026 వాల్ పోస్టర్‌ను గురువారం పెద్దపల్లి బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా ఆవిష్కరించారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల ప్రత్యేక సమావేశంలో జిల్లా పరీక్షల,సైన్స్ అధికారి వి.హనుమంతు ఈ పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రకృతిపై ప్రేమను, పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఏక్ పెడ్ మా కే నామ్ అనే అద్భుతమైన సందేశంతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆశయాలకు అనుగుణంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రతి విద్యార్థి కేవలం మొక్కలు నాటడమే కాకుండా,వాటిని వృక్షాలుగా మార్చే వరకు సంరక్షణ బాధ్యతను ఒక కర్తవ్యంగా స్వీకరించాలని పిలుపునిచ్చారు.అనంతరం నేషనల్ గ్రీన్ కార్ప్స్ జిల్లా కోఆర్డినేటర్ గుళ్ళ అంజన్ కుమార్ మాట్లాడుతూ నేడు నాటే చిన్న మొక్కే రేపటి భవిష్యత్తుకు భరోసా ఇస్తుందని, ప్రతి పాఠశాల ఒక పచ్చని ఉద్యానవనంగా మారాలన్నదే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మండల విద్యాధికారి టి.సురేంద్ర కుమార్,మండల విద్యాశాఖ అధికారులు డి.లక్ష్మణ్,ఐ.విజయ్ కుమార్ తోపాటు వివిధ స్కూల్ కాంప్లెక్సుల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక





**ప్రజాపక్షం/గొల్లపల్లి :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో అండర్ 15 బాల బాలికల బాక్సింగ్ ఎంపికలు నిర్వహించారు.ఈ సందర్భంగా వెయింగ్,ప్రతిభ ఆధారంగా రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు.జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన పారా మిలిటరీ జవాన్ బాక్సింగ్ కోచ్ పాదం మహేందర్ వద్ద శిక్షణ పొందుతున్న ,హర్షిత్ పటేల్ 46 49 కేజీల విభాగంలో ,సాహిత్ పటేల్ 30 33 కేజీల విభాగంలోఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ పాదం మహేందర్ తెలిపారు .ఈనెల 13 ,14 తేదీల్లో హైదరాబాద్ లోని ఆలే నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వీరు పాల్గొననున్నారని పేర్కొన్నారు .ఎంపికైన క్రీడాకారులను జగిత్యాల జిల్లా క్రీడా అధికారి రవికుమార్,జగిత్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పాదం మహేందర్ ,కార్యదర్శి గువ్వ శ్రీనివాస్,టిఆర్ఎస్‌వి రాష్ట్ర కార్యదర్శి పాదం తిరుపతి,మాజీ ఎంపిటిసిగోవిందుల లావణ్య జలపతి, పాదం రాజన్న క్రీడాకారులను అభినందించారు.

## దుబాయ్ ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే సత్యం

**ప్రజాపక్షం / చొప్పదండి:** దుబాయ్‌లోని ఎమిరేట్స్ రోడ్డుపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో జగిత్యాల జిల్లాకు చెందిన ముగ్గురు వలస కార్మికులు మృతి చెందడం పట్ల చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షుడూ.మేడిపల్లి సత్యం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. దుబాయ్‌లో లారీ ఆగి ఉండగా వెనుక నుంచి వచ్చిన మినీ బస్సు ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మొత్తం 5గురు మృతి చెందగా వారిలో ముగ్గురు తెలంగాణ వారు ఉన్నారు. దుబాయ్‌కు చేరుకున్న మేడిపల్లి సత్యంకు కాంగ్రెస్ ప్రవాస భారతీయుల విభాగం అధ్యక్షుడు డా.ఎస్‌వి రెడ్డి స్వాగతం పలికారు. ఆయనతో పాటు ఎల్లలా సీనన్న సేవా సమితి అధ్యక్షుడు రవి దేవుడ్, డా.బి.ఆర్.అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షుడు నల్లా నర్సయ్య, శ్రీనివాస్, రాజారెడ్డి, సత్యం తదితరులు ఉన్నారు.

## మత్తడి కాలువ పూడికతీత పనులు ప్రారంభం



**ప్రజాపక్షం / చొప్పదండి :** పట్టణ పరిధిలోని కుడి చెరువు మత్తడి నుంచి గుమ్లాపూర్ ఎక్స్‌రోడ్ వరకు మున్సిపల్ నిధులు రూ.5 లక్షలతో కాలువ పూడికతీత పనులను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరద నీటి కాలువ కూడుకొని పోయి వరద నీటి ప్రవాహం అధికంగా ఉన్నప్పుడు ఇండ్లలోని నీరు వెళుతున్నందున పూడికతీత పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య గౌడ, మున్సిపల్ కమీషనర్ కె.నాగరాజు, కౌన్సిలర్‌లు కనుమల్ల రాజశేఖర్, వడ్లూరి అనూష శ్యాంసుందర్, రాజన్నల రాజు, గుర్రం రాజేందర్ రెడ్డి, గుర్రం సుజీత్ రెడ్డి, పిట్టల వెంకటేశ్, మొత్తం రాజేశ్వరి గౌడ్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహేశ్, ఎన్నం అంజయ్య, మున్సిపల్ సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కోళ్ల ఫారం నిర్మాణంపై అధికారుల విచారణ

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి మండలం కొనరావుపేట్ గ్రామంలో ప్రతిపాదిత కోళ్ల ఫారం నిర్మాణానికి సంబంధించి ప్రజావాణిలో గ్రామ సర్పంచ్ ఫిర్యాదు చేయడం జరిగినది. అందిన ఫిర్యాదు మేరకు ఎంపిఓ,ఆర్ఐలు గురువారం స్థల పరిశీలన నిర్వహించారు. ఫారం నిర్మాణం జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు తమ అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపాదిత కోళ్ల ఫారం జిల్లా పరిషత్ హైస్కూల్, శివాలయం, కళ్యాణ మండపానికి అత్యంత సమీపంలో ఉండటంతో పాటు, నిర్మాణ స్థలం వద్ద నుంచి 132 కేవీ విద్యుత్ లైన్ వెళ్తోందని తెలిపారు. ఫారం ఏర్పాటు వల్ల దుర్వాసన, కాలుష్యం పెరిగి ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు.విచారణలో సర్పంచ్ మారు గంగారెడ్డి, ఉప సర్పంచ్ జక్కని పరంధాములు, వార్డు సభ్యులు, వీడీసీ చైర్మన్ మారు సాయిరెడ్డి, వైస్ చైర్మన్ సుంకె సంజీవ్‌తో పాటు గ్రామస్తులు పాల్గొని తమ అభిప్రాయాలు, అభ్యంతరాలను అధికారులకు వివరించారు. గ్రామస్తుల వాదనలను నమోదు చేసిన అధికారులు సంబంధిత నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు.

## ఆదర్శ పాఠశాల విద్యార్థి రేవతికి మొదటి ర్యాంకు

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగం చదువుతున్న మానాల రేవతి రాష్ట్రంలోనే మొదటి ర్యాంక్ సాధించింది. ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను అత్యధికంగా 469 మార్కులు సాధించి పాఠశాల ప్రతిష్టను రాష్ట్రస్థాయిలో నిలబెట్టింది. రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం పట్ల ప్రిన్సిపల్ భూమేష్ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ విద్యార్థిని రేవతి కృషి పట్టుదల అంకితభావమే అత్యధిక మార్కులు సాధించడానికి కారణమని ఆమె భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆకాంక్షిస్తూ అభినందించారు.

## మృతుడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని బిడి కాలనీలో నివాసముంటున్న సాజిద్ & వాజిద్ లారీ ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యుల తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను గురువారం కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ పరామర్శించారు.మృతుడి చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ బంగారు కల్ల కిషోర్, కౌన్సిలర్ అంగడి పురుషోత్తం,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



**ప్రజాపక్షం/-మల్లాపూర్ :** గొర్రెపల్లి గ్రామానికి చెందిన బోడ నవీన్ అకాల మరణం చెందగా చింతల పేట గ్రామానికి చెందిన ర మేష్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ర మేష్ పుట్టినరోజు సందర్భంగా చెందిన అ కార మరణం చెందిన నవీన్ కుటుంబానికి 5000 ఆర్థిక సహాయాన్ని ఉపసర్పంచ్ రాజుచేతులమీదగా గురువారం అందజేశా రు.

## మున్సిపల్ కౌన్సిర్లకు ఆత్మీయ సన్మానం

**ప్రజాపక్షం/కోరుట్ల :** రాజకీయ రంగంలో ప్రజల మన్ననలు పొంది ఉన్నత స్థాయి ఎదగాలని ఆకాంక్షించారు. స్వేచ్ఛ సాహిత్య సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కౌన్సిలర్లు మోర్తాడు లక్ష్మీ నారాయణ, పొట్ట సురేందర్, తెడ్డు విజయ్, చిట్యాల లక్ష్మీ నారాయణ,లకు ఆత్మీయ సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అభ్యుదయ కవి రాస భూమయ్య మాట్లాడుతూ రాజకీయ రంగంలో ప్రజల మన్ననలు పొంది ఇంకా ఉన్నతమైన పదవులు,హోదాలు పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పేట భాస్కర్,భూపెల్లి నాగేశ్వర రావు,మొగిలి,సామల్ల దశరథం,ఆత్మీయులు అభిమానులు పాల్గొన్నారు.

## పదవీ బాధ్యతలు స్వీకరించిన నాణ్యత విభాగాధిపతి

**ప్రజాపక్షం/రామగిరి:** రామగుండం3 ఏరియా నాణ్యత విభాగాధిపతి గా నియమితులైన యం.డి. ఆసిఫ్ యాసిన్ గురువారం రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ కు రిపోర్ట్ చేసి బాధ్యతలను స్వీకరించారు.వారు ఆర్.జి.ఓసిపి2 ఉపరితల గనిలో సేఫ్టీ ఆఫీసర్ గా విధులను నిర్వహిస్తు ఇటీవల జరిగిన బదిలీలలో ఆర్జీత్రీ ఏరియా నాణ్యత విభాగాధిపతి గా బదిలీపై వచ్చారు.ఈ సందర్భంగా పలువురు అధికారులు,ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

# యావర్ రోడ్డు వెడల్పు చేయాలి

### జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల:**జగిత్యాల జిల్లా కేంద్రంలోని యావర్ రోడ్డును వెడల్పు చేయడం తో పాటు రహదారుల పక్కన ఉన్న ఆక్రమణలు తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు.జగిత్యాల పురపాలక సంఘం కార్యాలయం లో కమిషనర్ సత్య ప్రణవ్ కలిసి జగిత్యాల పట్టణంలో యవర్ రోడ్డు వెడల్పు , రోడ్డు ఆక్రమణల తొలగింపు , అభివృద్ధి పనులపై వినతి పత్రాన్ని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా సీఎం జగిత్యాల పట్టణములో ఉన్న యావర్ రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. జగిత్యాల పట్టణములోని మిషన్ కాంపౌండ్ నుండి కొత్త బస్ స్టాండ్ వద్ద ఉన్న మంచాల కృష్ణ పెట్రోల్ బంక్ వరకు వెడల్పు చేయుటకు యాజమానుల డాక్యుమెంట్లు పరిశీలించి ఫైల్ సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.జగిత్యాల పట్టణములో వివిద ప్రదేశములలో వ్యాపారులు రోడ్లు ఆక్రమించి పర్మనెంట్ షెడ్లు వేసుకుని ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తూ వ్యాపారము చేస్తున్న వాటిని తొలగించాలన్నారు. తోపుడు బండ్ల వారు మాత్రము వ్యాపారము చేసుకునే అవకాశము కల్పించాలన్నారు.జగిత్యాలలో బీట్ చౌరస్తా లో నిర్మించిన సమీకృత వేజ్, నాన్ వెజ్ మార్కెట్ లో మటన్, చికెన్, ఫిష్ , పూలు పండ్లు, కూరగాయలు పెట్టుకుని మార్కెట్ సక్రమముగా నడిచే విదంగా త్వరిత గతిన తగు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమం ంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివా స్, ఎఎమ్‌సిచైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ అఖిల్,కౌన్సిలర్‌లుకోఆప్షన్‌సభ్యులు నాయకులు,పాల్గొన్నారు.

# నిరుద్యోగ క్రైస్తవ యువతకు ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణ

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** తెలంగాణ ప్రభుత్వ మైనార్టీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ క్రైస్తవ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను నిరుద్యోగ క్రైస్తవ యువతకు ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పి.నరేష్ కుమార్ నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ నేపథ్యంలో, టాస్క్ ఇజిఎమ్ఎమ్, మెప్మా , ఎన్ఎస్‌డిసి,ఎన్ఐఎమ్ఎస్ఎమ్ఇ,ఇతర ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలతో అనుబంధం కలిగి, ఉపాధి కల్పనలో అనుభవం ఉన్న శిక్షణ భాగస్వామ్య సంస్థలు తమ ప్రతిపాదనలను సమర్పించవలసిందిగా కోరడమైనదనీ, శిక్షణ భాగస్వామ్య సంస్థలు జనరల్ డ్యూటీ అసిస్టెంట్, డ్రోన్ ఆపరేటర్, సైబర్ సెక్యూరిటీ, రూఫ్ టాప్ సోలార్ గ్రిడ్ జూనియర్ ఇంజనీర్, సాఫ్ట్‌వేర్ డెవలపర్ సర్వీసెస్, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్, జనరేటివ్ / మెషిన్ లెర్నింగ్, మెడికల్ రిప్రజెంటేటివ్, పేమెంట్ రిలేషన్స్ అసోసియేట్, వీడియో ఎడిటింగ్ విత్ ఎఐ టూల్స్, సైబర్ సెక్యూరిటీ అసోసియేట్, సోలార్ ఎల్ఈడి టెక్నీషియన్, అడ్వాన్స్ బ్యూటీ థెరపీ, హౌస్ కీపింగ్, డేటా సైన్స్ ,అనలిటిక్స్, డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్, గ్రాఫిక్ డిజైన్ విత్ ఏఐ టూల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అసోసియేట్, ఎలక్ట్రిక్ వెహికల్ అసెంబ్లీ టెక్నీషియన్, ప్లంబర్ జనరల్, సోలార్ ప్యానెల్ ఇన్‌స్టలేషన్, హెల్త్ కేర్ అసిస్టెంట్ వంటి పలు కోర్సులలో శిక్షణ అందించడానికి దరఖాస్తు చేసుకోవచ్చు అని,ఆసక్తి గల శిక్షణ భాగస్వామ్య సంస్థలు తమ సంస్థ వివరాలు, ప్రభుత్వ/నైపుణ్యాభివృద్ధి సంస్థల అనుబంధ ధృవపత్రాలు, శిక్షకుల అర్హతలు, మౌలిక సదుపాయాల వివరాలు, గతంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల సమాచారం, ప్లేస్‌మెంట్ రికార్డులను జతచేసి తమ ప్రతిపాదనలను జిల్లా మైనార్టీల సంక్షేమ అధికారి కార్యాలయం, పెద్దపల్లి వారికి సమర్పించాలని, అందిన ప్రతిపాదనలను పరిశీలించి, క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన అనంతరం అర్హత కలిగిన సంస్థలకు తెలంగాణ క్రైస్తవ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా పని ఆదేశాలు జారీ చేయబడతాయని, పూర్తి వివరాల కోసం కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని మైనారిటీ సంక్షేమ అధికారి ప్రకటనలో పేర్కొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామానికి చెందిన బెల్లంకొండ వీరయ్య (85) ఇటీవల అనారోగ్యంతో మరణించారు. గురువారం దినకర్మ కార్యక్రమం నిర్వహించగా ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి,ఉపసర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్, బోమ్మిడి మల్లేష్ తో పాటు తదితర నాయకులు గురువారం ఆయన నివాసానికి వెళ్లారు.మృతుడి కుటుంబాన్ని వారు పరామర్శించి, తమ గాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం మృతుడు వీరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచులు :** ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ తాజా మాజీ ఎంపిటిసిదొడ్డ గీతారాణి సోదరుడు ఎలిమిళ్ళ సమ్మయ్య హుజురాబాద్ లో ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాన్ని ముత్తారం మండల సర్పంచులు పరామర్శించి ప్రగాఢ సంతపం తెలియజేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో సర్పంచ్ చొప్పరి సంపత్, రాజేశం,రాపల్లి రాజయ్య, మెంగాని సమత తిరుపతి ఉన్నారు.

# రక్షిత మంచినీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

### కాలనీవాసుల హర్షం



**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలోని ఎస్టీ కాలనీ రెండో వార్డులో లీకేజీ అవుతున్న రక్షిత మంచినీటి పైప్‌లైన్‌కు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం మరమ్మతులు చేపట్టారు.గ్రామంలోని మంచినీటి సరఫరా నల్లా వద్ద గత కొన్ని రోజులుగా పైప్‌లైన్ లీకేజీ అవుతుండటాన్ని గమనించిన గ్రామ సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి వెంటనే స్పందించారు.లీకేజీని అరికట్టి నీటి వృధాను అడ్డుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేందర్ ని ఆదేశించారు. సర్పంచ్ ఆదేశాల మేరకు అధికారులు యుద్ధప్రాతిపదికన స్పందించి పైప్‌లైన్‌కు విజయవంతంగా మరమ్మతులు పూ ర్తి చేయించారు.దీంతో ఎస్టీ కాలనీ ప్రజలకు ఎదురవుతున్న మంచి నీటి సమస్య తీరింది.సకాలంలో స్పందించి లీకేజీని అరికట్టినందుకు గానూ కాలనీవాసులు గ్రామ సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డికి,ఉపసర్పంచ్ ప్రశాంత్ గౌడ్‌కు, పంచాయతీ కార్యదర్శి రాజేందర్‌కు,పాలకవర్గ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇంటర్ ఫలితాల్లో పి.ఆర్.బి.ఎం కళాశాల విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం /కోరుట్ల :** ఇంటర్మీడియట్ బోర్డ్ గురువారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో పట్టణానికి చెందిన పి.ఆర్.బి.ఎం విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించారు. ఎంపీసీ ఫస్ట్ ఇయర్ టీ.నెహశ్రీ 468/470 మార్కులు సాధించి రాష్ట్రంలో మొదటి స్థానం సాధించగా,డి. సాయి దీప్ 467/470 రెండో స్థానం సాధించారు. అలాగే,సిహెచ్ మనజ్ఞ 465/470, రయాన్ 463/470, సాహితి 462/470, రెహాన్ 460/470 మార్కులు సాధించారు.బైపీసీ ఫస్ట్ ఇయర్ విభాగంలో జోనా ఫలక్ 437/440,సీహెచ్ రినేషా 437/440,ఆర్. తేజస్విని 437/440 మార్కులతో రాష్ట్రంలో ముగ్గురు విద్యార్థినిలు ద్వితీయ స్థానం సాధించారు. అలాగే కే. నందిని 436/440, సిహెచ్. అక్షర 435/440 మార్కులు సాధించి మూడో,నాలుగో స్థానం సాధించారు. ఈ ఫలితాలు సాధించడంలో కృషి చేసిన అధ్యాపక బృందం, విద్యార్థులకు,తల్లిదండ్రులకు కళాశాల కరస్పాండెంట్‌పోతని ప్రవీణ్ కుమార్ అభినందనలు తెలిపారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం / చందుర్తి :** మండల కేంద్రం లోని రైతు వేదిక భవనం లో గురువారం రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన 37 మంది లబ్ధిదారులకు 12 లక్షల 37 వేల రూపాయలు విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లో రైతు ప్రభుత్వం నడుస్తోందన్నారు.రైతులను రాజులను చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన సాగుతోందన్నారు.ఈసారి వరి ధాన్యం లో దిగుబడి గణనీయంగా పెరిగిందని ,చివరి ధాన్యం గింజ వరకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందవద్దాన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్లి యువకుడి గల్లంతు

**ప్రజాపక్షం/వీర్నపల్లి:**మండల కేంద్రంలోని వెంకట్రాయిని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన ఇద్దరు యువకుల్లో ఒకరు గల్లంతయ్యారు. వివరాల్లోకి వెళితే బాబాయి చెరువు తండా గ్రామానికి చెందిన భూక్య ప్రశాంత్ అనే యువకుడు చెరువులో చేపలు పట్టే సమయంలో కనిపించకుండా పోయాడు. అతనితో కలిసి వెళ్లిన మరో యువకుడు గుగులోత్ సంతోష్ స్థానికులకు సమాచారం అందించడంతో పోలీసులు, గ్రామస్తుల సహకారంతో సాయంత్రం వరకు గాలించిన ప్రశాంత్ ఆచూకీ లభించలేదు. గల్లంతయిన యువకుడికి తల్లి గేలీబాయి, భార్య ఉన్నారు. స్థానిక ఎస్ఐ వేముల లక్ష్మ ణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అనారోగ్య బాధితుడికి కాంగ్రెస్ నాయకుడి పరామర్శ



**ప్రజాపక్షం/ముత్తారం** :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని కేషనపల్లి గ్రామానికి చెందిన తిప్పాని మొగిలి గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం ఆయన నివాసానికి వెళ్లారు.అనారోగ్యంతో ఉన్న మొగిలిని సదానందం ప్రత్యేకంగా పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని,అందుతున్న వైద్య చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు.అధైర్యపడకుండా మనోధైర్యంతో ఉండాలని మొగిలి కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు.

## మున్నూరు కాపు సంఘం కార్యవర్గం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. గ్రామంలో నిర్వహించిన సమావేశంలో గ్రామ శాఖ అధ్యక్షులుగా గురిజాల రాజు,ఉపాధ్యక్షులుగా పూరెళ్ల రాజయ్య, జనరల్ సెక్రటరీగా గాండ్ల రవి, కోశాధికారి దామెరకొండ శంకర్, ప్రచార కార్యదర్శిగా తోట మల్లేశం లను ఎన్నిక చేసినట్లు సంఘం నాయకులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ రానున్న రోజుల్లో అందరి సహకారంతో సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కాగా నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు.

## గ్రామ రక్షణకే.. సిసి కెమెరాలు

### సర్పంచ్ కవిత-కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/ముత్తారం :** గ్రామాల్లో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకే సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ పోతిపెద్ది కవితకిషన్ రెడ్డి తెలిపారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను సర్పంచ్ కవిత కిషన్ రెడ్డి, ఎంపిడిఓ సురేష్, గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేందర్, ముత్తారం పోలీసులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కవితకిషన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామస్తుల రక్షణ, భద్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో మొదటి విడతగా సుమారు 10 సిసి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. గ్రామంలోని ముఖ్య కూడళ్లు, వీధుల్లో వీటిని అమర్చినట్లు పేర్కొన్నారు. రాబోయే కొద్ది రోజుల్లో మరికొన్ని కీలక ప్రాంతాల్లో కూడా సిసి కెమెరాలను ఏర్పాటు చేసి గ్రామాన్ని పూర్తిగా నిఘా నీడలోకి తీసుకువస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు,మండల పరిషత్ అధికారులు, ముత్తారం పోలీస్ సిబ్బందితోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థినికి సన్మానం

**ప్రజాపక్షం/ముత్తారం :** పాఠశాలకు ఒక్క రోజు కూడా సెలవు పెట్టకుండా నిరంతరం హాజరైన తొమ్మిదో తరగతి విద్యార్థిని సోమరపు రక్షితను ముత్తారం మండలం ఓడేడు గ్రామ సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి ఘనంగా అభినందించి, సన్మానించారు. జూన్ 2025 నుండి మార్చి 5 వ తేదీ 2026 వరకు రక్షిత చూపిన వంద శాతం హాజరు, సమయపాలన, క్రమశిక్షణను ఉపాధ్యాయులు కొనియాడారు.తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిన రక్షితకు సర్పంచ్‌తో పాటు మండల విద్యాధికారి హరిప్రసాద్, ఎంపిడిఓ సురేష్, గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేందర్,ఉపసర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్, ఉపాధ్యాయ బృందం కలిసి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## బెల్ట్ షాపులు.. మూసివేయాలి

**ప్రజాపక్షం/ కమలాపూర్:** కమలాపూర్ మండలంలోని మాదన్నపేట గ్రామానికి చెందిన మహిళా సంఘాల సభ్యులు కలిసి బెల్ట్ షాపులు నివారించడం వల్ల గ్రామంలో శాంతి భద్రతలు మెరుగుపరచడమే కా కుం డా, కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెంది కుటుంబ సభ్యులు సంతోషంగా జీవించే అవకాశం ఉందని భావిస్తూ గ్రామ సర్పంచ్ కత్తి రమేష్ కి బెల్ట్ షాపులను పూర్తిగా నివారించడానికి వినతి పత్రాన్ని మహిళలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు రజిత, సభ్యులు అశ్విని, లతా, శ్రీలత, భాగ్య, వినోద, స్వరూప, పలువురు మహిళలు పాల్గొన్నారు.

# బడిబాటతోనే విద్యా చైతన్యం

**ప్రజాపక్షం / మందమర్రి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా గురువారం పొన్నారం గ్రామంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పెంచాల మధు ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఉపాధి హామీ పనుల్లో నిమగ్నమైన కూలీల వద్దకు వెళ్లి, తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల భావిష్యత్తుకు విద్యే బలమైన పునాది అని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో అందుబాటులో ఉన్న విద్యా సౌకర్యాలు, నాణ్యమైన బోధన, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. ప్రతి చిన్నారి విద్యను అభ్యసించేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచడం, బడి మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించడం, విద్యపై తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో ప్రతి చిన్నారి విద్యాబాట పట్టేలా కృషి చేయాలని వారు సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రఫీల్ రెడ్డి, ఉపసర్పంచ్ పెంచాల అమృత రాజలింగు, వార్డు సభ్యులు సంకే శ్రీనివాస్, సురిమిల్ల పద్మ, బోర్లకుంట లక్ష్మ ణ్, ఉపాధ్యాయులు, ఫీల్డ్ అసిస్టెంట్ ఈద లింగయ్య, గ్రామ కార్యదర్శి హరీష్, ఎఈఓ రాజశేఖర్ పాల్గొన్నారు.



## టిబిజికెఎస్ పోరాటంతోనే నియామక పత్రాలు



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** సింగరేణిలో కారుణ్య నియామకాల ద్వారా ఎంపికై, నియామక పత్రాల కోసం ఎదురు చూస్తున్న దాదాపు 400 మందికి ఈ నెల 13న పత్రాలు అందజేయడం టిబిజికెఎస్ పోరాట ఫలితమేనని ఆ సంఘ నాయకులు ప్రతాప్, సారంగపాణి పేర్కొన్నారు. కాసిపేట 2 గనిపై వారు మాట్లాడారు. మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పోరాటం, ప్రభుత్వంపై తెచ్చిన ఒత్తిడి వల్లే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా శ్రీరాంపూర్ ఏరియాలో ఈ పత్రాల అందజేత ప్రక్రియ సాధ్యమైందన్నారు. రామగుండం సదస్సు వేదికగా సింగరేణి సమస్యలను, కుంభకోణాలను కార్మికుల ముందు ఉంచి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చామని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలపై శ్రీరాంపూర్ వేదికగా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై పోరాడుతున్న మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, కొప్పుల ఈశ్వర్, సంఘం అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోషం, మస్కా రమేష్, ఉదయ్, ప్రభాకర్, విశాల్ పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల పట్టాల పంపిణీ

**ప్రజాపక్షం / కాగజ్‌నగర్ :** కాగజ్‌నగర్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు ఇక్బాల్ ఉర్దూ హైస్కూల్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రత్యేక వార్డు సభ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బి తిరుపతి, మున్సిపల్ చైర్పర్సన్ షాహిన్ సుల్తానా, వార్డు కౌన్సిలర్ బసరత్ తస్కీన్ పాల్గొని డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీ, పన్నుల వసూళ్ల తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలు, సూచనలు, అభ్యర్థనలను అధికారులు నమోదు చేసుకున్నారు. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధిని మరింత వేగవంతం చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును సమర్థవంతంగా కొనసాగించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వార్డు అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు నియాజుద్దీన్ బాబా, శ్రీనివాస్ లక్ష్మ ణ్, జఫర్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు సాబీర్, సాగర్, అఖిల్ పాల్గొన్నారు.




## పుట్ట మధుపై అర్థ రహిత విమర్శలు సహించం

### బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/ముత్తారం :** మంథని మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి పుట్ట మధుపై అర్థ రహిత విమర్శలు చేస్తే సహించేది లేదని ముత్తారం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి హెచ్చరించారు. ముత్తారం మండల కేంద్రంలోని కాసర్ల గడ్డ బస్టాండ్ ఆవరణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్య కేసులో ఎలాంటి ప్రమేయం లేని బిఆర్ఎస్ నాయకులు పూదరి సత్యనారాయణ గౌడ్ పై కేసు అక్రమైనదని ఇందులో నూటికి నూరు పాళ్లు రాజకీయ కుట్ర దాగివుందని ఆరోపించారు. ఏది వాస్తవమో... ఏది అవాస్తవమో.. కండ్లున్నా చూడలేని కబోదుల్లా కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. మంథని నియోజకవర్గంలో అధికార పార్టీని ప్రశ్నిస్తే చాలు ఆ ప్రశ్నించే గొంతుకులను నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.అధికార పార్టీ నేతల మెప్పు కోసం పోలీసులు అత్యుత్సాహం చూపిస్తుండడం శోచనీయమన్నారు.రాష్ట్రంలో మాయ మాటలతో గారడీ గ్యారంటీలతో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అటకెక్కించినట్లే మంథని సెగ్మెంట్ లో కూడా మాయ మాటలతో ప్రజలను మభ్యపెడుతూ కాలం వెళ్లదీస్తుందన్నారు. దాదాపు 40 ఏళ్ల పాటు మంథనిలో అధికారంలో ఉన్న తండ్రి కొడుకుల కాలంలో చేయలేనటువంటి రింగు రోడ్డును పుట్ట మధు హయాంలో పూర్తి చేయడం జరిగిందన్నారు.మంథని మట్టి బిడ్డ పుట్ట మధు అధికారంలో ఉన్న ప్రతి పక్షంలో ఉన్నా ఎప్పుడు ఈ ప్రాంత ప్రజల కష్ట సుఖాల్లో తోడుండే నాయకుడని అలాంటి నాయకుడిని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాల ప్రజల పెన్నిధి పుట్ట మధును గెలిపించుకోవాలనే సంకల్పంతో ప్రజలు ఉన్నారన్నారు.ఏది ఏమైనా పుట్ట మధు విజయాన్ని ఎవ్వరు అడ్డుకోలేరని స్పష్టం చేశారు.



## మొర్రిగుడం తండాలో.. టిబిఎంబిఎ శిబిరం



**ప్రజాపక్షం / జన్నారం :** మొర్రిగుడం తండా గ్రామంలో టిబిఎంబిఎ వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా టిబి ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ ఆదేశాల మేరకు జన్నారం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఉమాశ్రీ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో రెండు వారాలకు మించి జ్వరంతో బాధపడుతున్న వారు, అరవై సంవత్సరాలు పైబడిన వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 110 మందికి ఎక్స్‌రే పరీక్షలు, 20 మందికి తెమడ పరీక్షలు చేశారు. క్షయవ్యాధి లక్షణాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అనుమానిత లక్షణాలు ఉన్న వారు వెంటనే పరీక్షలు చేయించుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి విజయ్ లచ్చన్న, పూజ, సురేష్, హెల్త్ అసిస్టెంట్ టి. పోచయ్య, వసంత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15 నుండి పోలీస్ కానిస్టేబుల్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు కెరీర్ గైడెన్స్ సెల్ ఇన్‌చార్జ్ డాక్టర్ లక్ష్మి నరసింహంతో కలిసి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శిక్షణ పొందగోరే ఇంటర్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 15న ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరు కావాలని కోరారు.

## టిజిఆర్‌టిసి నిజామాబాద్ ఆర్ఎంగా ఎస్‌పిజికె మూర్తి



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, నిజామాబాద్ ఆర్ఎంగా ఎస్‌పిజికె మూర్తి గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటి రీజినల్ మేనేజర్, ఆరు డిపోల మేనేజర్లు, రీజియన్ కార్యాలయ అధికారులు ఆర్ఎంకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ ఎస్‌విజికె మూర్తికి, డిప్యూటి రీజినల్ మేనేజర్‌కు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ ఆరుడిపోల మేనేజర్లు, ఆర్ఎం కార్యాలయ సిబ్బంది, ఆర్‌టిసి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విఓ బిల్డింగ్ పరిశీలించిన ఎంపిడిఓ

**ప్రజాపక్షం / లోకేశ్వరం :** మండలంలోని ధర్మోర గ్రామంలోని నూతనంగా నిర్మిస్తున్న విఓ బిల్డింగ్ పనులను పరిశీలించడం జరిగిందని ఎంపిడిఓ తెలిపారు. బిల్డింగు నాణ్యతతో ఉండాలని పలు సూచనలు చేశారు. అలాగే నర్సరీలో మొక్కలను పరిశీలించి, రానున్న రోజుల్లో మొక్కలు నాటే కార్యక్రమం ఉంటుందని మొక్కలను సంరక్షించాలని సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంజీవ్ రెడ్డి ఈసి అనీల్ పంచాయతీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నా రు.



## లింబాద్రిగుట్టపై 13న మహా హోమాలు

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన లింబాద్రిగుట్టపై లోక కల్యాణార్థం 13న మహా హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త నంబి పార్థసారథి తెలిపారు. కొండపై పవమాన, సుదర్శన, నర్సింహా మన్యు సూక్త, శ్రీ సూక్త హోమాలను వైభవంగా జరిపించనున్నామన్నారు. ఈ పవిత్ర హోమాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి రుసుము ఉండదని, భక్తులందరూ భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.